సాక్షి చిత్తూరు

గురువారం । 25 । జూలై । 2024



భక్తిప్రపత్తులతో సంకటహర చతుర్థి

కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో బుధవారం సంకటహర చతుర్థిని భక్తిప్రపత్తులతో నిర్వహించారు. - 8లో



జోరుగా సారా తయారీ

గ్రామీణ ప్రాంతాల్లో సారా విచ్చలవిడిగా విక్రయిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలొస్తున్నాయి. - 8లో



దారాలు తీయమన్నందుకు..

దుస్తులు ఆరేసే దారాలను తీయమన్నందుకు ఓ మహిళపై మరోవర్గం దాడి చేసి భయభ్రాంతులకు గురి చేసింది. - 8లో

న్యూస్‌రీల్

ట్రాన్స్‌కో గ్రీవెన్స్‌కు 22 సమస్యలు



చిత్తూరులో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఈఈ మునిచంద్ర

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ట్రాన్స్‌కో ఎస్‌ఈ సురేంద్ర నాయుడు తెలిపారు. బుధవారం జిల్లాలోని ఈఈ కార్యాలయాల్లో నిర్వహించిన విద్యుత్ గ్రీవెన్స్‌లో మొత్తం 22 సమస్యలు వచ్చాయని, వీటిలో 9 పరిష్కరించినట్టు చెప్పారు. మిగిలిన వాటిని పరిశీలించి, ఆర్థిక అనుమతులు తీసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కువగా బిల్లింగ్ సమస్యలు, కేబుల్, కరెంటుపోల్స్, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పు, ఏర్పాటు, కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు వంటి సమస్యలపై ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. చిత్తూరులోని ఫిర్యాదుల కార్యక్రమంలో ఈఈలు మునిచంద్ర, హరి, డీఈలు శేషాద్రి, పద్మనాభ పిళ్లై, జ్ఞానేశ్వర్, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకపోతే కేసులు

- ప్రైవేటు ఆస్పత్రులకు డీఎంహెచ్‌ఓ హెచ్చరిక



ఆస్పత్రి తనిఖీలో డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతిదేవి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులు నిబంధనలు పాటించాలని, లేనిపక్షంలో కేసులు నమోదు చేస్తామని డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతిదేవి హెచ్చరించారు. చిత్తూరులోని పలు ప్రైవేటు ఆస్పత్రులను బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్వర్తిస్తున్నారా, లేదా? ఆరా తీసి పైవిధంగా హెచ్చరించారు. వైద్యం పేరిట ప్రజలను మోసం చేయవద్దని హితవు పలికారు.

26న కృత్రిమ కాళ్ల కొలతల శిబిరం

చిత్తూరు కలెక్టరేట్: ఈ నెల 26న స్థానిక తపోవనంలో ఉచిత కృత్రిమ కాళ్ల కొలతల శిబిరం నిర్వహించనున్నామని జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో కాళ్లు లేని వారు సంబంధిత ధ్రువపత్రాలతో శిబిరానికి హాజరు కావాలన్నారు. వారి కాళ్ల కొలతలు తీసుకున్న తర్వాత 20 రోజులకు ఉచితంగా కృత్రిమ కాళ్లు పంపిణీ చేస్తామన్నారు. అర్హత ఉన్న వారు ఆధార్, రేషన్ కార్డు, సదరం సర్టిఫికెట్, వికలత్వం కనిపించే విధంగా రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకురావాలన్నారు. ఇతర వివరాలకు 9440357522 (రాజశేఖర్‌నాయుడు), 6281486722 (సొహైల్ అబ్బాస్) సెల్ నంబర్లను సంప్రదించాలని ఏడీ కోరారు.

118 మంది టీచర్లకు అన్యాయం

– కోర్టును ఆశ్రయించిన బాధితులు


చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ప్రభుత్వ బడుల్లో పనిచేస్తూ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న టీచర్లు ఎన్నికలకు ముందు ప్రభుత్వ బదిలీలకు (గవర్నమెంట్ ఆర్డర్స్)కు దరఖాస్తు చేసుకున్నారు. వాటిని పరిశీలించిన గత ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి జూన్ వరకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 118 మందికి ప్రభుత్వ బదిలీలకు ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు జారీచేసింది. అయితే అప్పట్లో ఎన్నికల కోడ్ ఉండడంతో ఆ టీచర్లను బదిలీ చేయకుండా జిల్లా విద్యాశాఖ అధికారులు మిన్నకుండిపోయారు. అలాగే ఉత్తర్వులు పొందిన టీచర్లను ఆయా పాఠశాలల హెచ్ఎంలు రిలీవ్ చేయలేదు. ఈ సమస్యపై స్పష్టత ఇవ్వాలని ఇటీవల పలు జిల్లాల డీఈఓలు రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్‌ను కోరారు. దీనిపై స్పందించిన ప్రస్తుత ప్రభుత్వం 118మంది టీచర్ల జీవోలను ఆమోదించడం లేదంటూ ఈ నెల 24న ఉత్తర్వులు జారీచేసింది. దీంతో టీచర్లు లబోదిబోమంటూ మండిపడుతున్నారు. పలువురు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

నోడల్ అధికారిగా ప్రసన్నకుమార్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా స్థాయి నోడల్ అధికారిగా రాష్ట్ర స్థాయి కేడర్ గల పబ్లిక్ లైబ్రరీస్ డైరెక్టర్ ప్రసన్నకుమార్‌ను నియమిస్తూ రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు ఉత్తర్వులు జారీచేశారు. వివిధ మాధ్యమాలు, వార్తాపత్రికల్లో వచ్చే ప్రతికూల వార్తలను మానిటరింగ్ చేసేందుకు రిడ్రెసల్ మెకానిజమ్ ఫర్ అడ్రెసింగ్ అడ్వర్స్ న్యూస్ పబ్లిష్డ్ వేరియస్ ప్లాట్‌ఫామ్స్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇందులో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలకు సీనియర్ కేడర్ అధికారులను నియమించినట్లు తెలిపారు. తిరుపతి, చిత్తూరు జిల్లాలకు ప్రసన్నకుమార్‌ను నియమించినట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

చిరుద్యోగులపై కుట్ర

కూటమి నేతలు వైఎస్సార్‌సీపీ శ్రేణులనే కాదు.. చివరకు చిరుద్యోగులను కూడా విడిచిపెట్టడం లేదు. గ్రామస్థాయిలో కీలకమైన అంగన్‌వాడీ, పారిశుద్ధ్య కార్మికులు, ఆశావర్కర్లు, డీలర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లపై సైతం కత్తి కట్టారు. ప్రస్తుతం ఉన్న వారందరినీ తొలగించి జేబులు నింపుకోవడమే పరమావధిగా ఆయా స్థానాల్లో తమ వారిని నియమించుకునేందుకు సామదాన దండోపాయాలు ప్రయోగిస్తున్నారు. 'మా ప్రభుత్వం వచ్చింది.. మేము చెప్పిన వారే ఉండాలి. వేరే వాళ్లు ఉండడానికి వీల్లేదు.. దీనికి సంబంధించిన జాబితాను పంపిస్తాం.. అప్పటి వరకు వారిని ఉద్యోగాల్లోకి రానివ్వకండి.' అంటూ కూటమి నేతలు ఉన్నతాధికారులకు అల్టిమేటం ఇచ్చారు. ఆయా ఉద్యోగాల్లో కొనసాగాలంటే ఒక్కో పోస్టుకు ఒక్కో రేటు ఫిక్స్ చేసి వసూళ్ల పర్వానికి తెరదీశారు. ఇప్పటికే పలువురు వసూల్‌రాజా అవతారాలెత్తి జేబులు నింపుకుంటున్నారు. వీరి ధాటికి చిరుద్యోగులు హడలిపోతున్నారు.



ఉమ్మడి చిత్తూరు జిల్లా వివరాలు	తిరుపతి జిల్లా	చిత్తూరు జిల్లా
అంగన్ వాడీల్లో	4,504	4,144
పారిశుద్ధ్య కార్మికులు	2,434	2,405
ఆశావర్కర్లు	1,686	1,526
డీలర్లు	1,457	1,379
ఫీల్డ్ అసిస్టెంట్లు	757	596

- ఉపాధి హామీ, ఆశా వర్కర్లు, పారిశుద్ధ్య కార్మికులు, డీలర్లు, అంగన్‌వాడీ వర్కర్లను తొలగించేందుకు కుట్రలు
- తమవారికి కట్టబెట్టేందుకు అధికారులకు కూటమి నేతల తప్పుడు ఫిర్యాదులు
- విధుల నుంచి తప్పుకోవాలని అధికారులతో పచ్చ నేతల ఒత్తిళ్లు
- పలు చోట్ల ఉపాధి పనులను నిలిపివేయించిన వైనం
- రోడ్డున పడుతున్న చిరుద్యోగులు
- ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా ఆందోళనలకు సిద్ధం


CHITTOOR MANDAL FIELD ASSISTANT NAMES

[illegible]

ఎక్కడెక్కడ ఎవరిని నియమించాలో టీడీపీ లెటర్ ప్యాడ్‌లో పేర్లు రాసి అధికారులకు పంపిన లేఖ

సాక్షి ప్రతినిధి, తిరుపతి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది మొదలు జేబులు నింపుకోవడమే పరమావధిగా ఆ పార్టీ నాయకులు దృష్టి సారించారు. తక్షణ ఆదాయం వచ్చే పథకమైన ఉపాధి హామీని ఆదాయ వనరుగా మార్చుకోవాలని నిర్ణయించుకున్నారు. ఉపాధి హామీ పథకం కింద మొత్తం 230 రకాల పనులు చేసుకోవచ్చు. వీటిలో ప్రధానంగా నీటి కుంటల నిర్మాణం, గుట్టల్లో కందకాలు, పొలం చుట్టూ సరిహద్దు కందకాలు, 'అమృత్ సరోవర్' స్కీమ్ కింద చెరువుల పనులు..ప్లాంటేషన్ పనులు ఎక్కువగా చేస్తున్నారు.. ఇలాంటి పనులను ఒప్పంద పద్ధతిలో టీడీపీ నాయకులే చేసుకునేందుకు తమకు అనుకూలమైన క్షేత్ర సహాయకులను నియమించుకోవాలని రంగంలోకి దిగారు.

ఒక్కొక్కరికి ఒక్కో రేటు ఫిక్స్!

ప్రస్తుతం పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు, డీలర్లు, ఆశావర్కర్లు కొనసాగాలంటే గ్రామస్థాయి నాయకుడికి కొంత మొత్తం ఇవ్వాలి. ధనార్జనే ధ్యేయంగా కూటమి నేతలు ఒక్కొక్కరికి ఒక్కో రేటు నిర్ణయించారు. ఫీల్డ్ అసిస్టెంట్‌కి రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షలు, రేషన్ డీలర్లు రూ.50వేల నుంచి రూ.లక్ష., మధ్యాహ్న భోజన నిర్వాహకులకు రూ.25వేల నుంచి రూ.2 లక్షల వరకు రేటు నిర్ణయించినట్లు ప్రచారంలోకి వచ్చింది. డబ్బులిస్తే సరి..లేదంటే తప్పుకోవాలంటూ కూటమి నేతల బెదిరింపులపై ప్రజా సంఘాలు ఆందోళనకు సిద్ధమవుతున్నాయి. ఇటీవల తిరుపతి కలెక్టరేట్ వద్ద కందారపు మురళి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా చేయటం ఇందుకు నిదర్శనం.

పనులు ఆపేయండి

ఫీల్డ్ అసిస్టెంట్లను తమ వారిని నియమించుకునే దిశగా కూటమి నేతలు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులు నిలుపుదల పక్కాగా స్కెచ్ వేశారు. వారి ఒత్తిడి మేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు పంచాయతీల్లో ఉపాధి పనులను ఆపేశారు. పనిచేస్తున్న సహాయకులను తొలగించి తాము చెప్పిన వారిని నియమించమని టీడీపీ నాయకులు అధికారులకు లేఖలు పంపుతున్నారు. ఇప్పటికే కొందరు డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్‌కు పంచాయతీల వారీగా మార్పు చేయాల్సిన వారి జాబితాలను అందజేసి, ఆయా పంచాయతీల్లో క్షేత్ర సహాయకులు, టీఏలు, ఏపీఓలపై బెదిరింపులకు దిగారు. చేసేదేమీలేక ఏపీఓలు కూటమి నేతలు చెప్పినట్లు నడుచుకుంటున్నారు. ఈ దిశగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లపై తప్పుడు ఫిర్యాదులు చేయించి తొలగించేందుకు పూనుకున్నారు. వలంటీర్ పోస్టుల భర్తీ ప్రక్రియపై స్పష్టత లేకపోవడంతో ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టుకు టీడీపీలోని పలువురు కార్యకర్తలు పోటీ పడుతున్నారు. క్షేత్రస్థాయిలో కీలకమైన ఫీల్డ్ అసిస్టెంట్లుగా తమ వారు ఉంటే నిధులు స్వాహాకు అడ్డే ఉండదని భావించి చిరుద్యోగులపై ప్రతాపం చూపుతున్నారు. చిరుఉద్యోగాన్నే నమ్ముకుని కొన్నేళ్లుగా జీవనం సాగిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లను కూటమి నేతలు స్వార్థ ప్రయోజనం కోసం రోడ్డున పడేస్తున్నారు. పనులు నిలిచిపోవడంతో అనేక మంది ఎలాగైనా పట్టణాల్లో పనులు చేసుకుని కుటుంబాలను పోషించే ప్రయత్నాల్లో ఉన్నారు.

అంగన్‌వాడీ..డీలర్ల తొలగింపునకు కసరత్తు

గ్రామాల్లో మరో కీలకమైన అంగన్‌వాడీ వర్కర్లు, రేషన్ డీలర్లను తొలగించి వారి స్థానంలో తమ వారిని నియమించుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే స్వచ్ఛందంగా తప్పుకోవాలని పలువురికి హుకుం జారీ చేశారు. భవిష్యత్తులో ఇబ్బంది తలెత్తకుండా ఉండేందుకు కూటమి నేతలు పక్కా వ్యూహంతో రేషన్ డీలర్లు, అంగన్‌వాడీ వర్కర్లపై ఒత్తిళ్లు తెచ్చి రాజీనామా లేఖలు రాయించుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం సరఫరా చేసే పౌష్టికాహారం, సరుకులను విక్రయించి జేబులు నింపుకునేందుకు తమ అనుకూలమైన వర్కర్లను నియమించుకునే పనిలో నిమగ్నమయ్యారు. ప్రభుత్వం నుంచి రేషన్ సరుకులు ఇష్టానుసారంగా అమ్ముకుని సొమ్ము చేసుకోవడానికి వీలుగా తమకు అనుకూలురైన వారిని, నమ్మకస్తులను చౌక దుకాణాల డీలర్లను నియమించుకుంటున్నారు. అలాగే మధ్యాహ్నం భోజనం వర్కర్లను కూడా తొలగించి వారి స్థానాల్లో తమకు నచ్చిన వారినే అధికారులతో నియమించుకుంటున్నారు.

తొలగించేందుకు గ్రామసభ!

శ్రీకాళహస్తి మండలం పుల్లారెడ్డి కండ్రిగ, కాసరంలో ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించడానికి వచ్చేనెల 3న గ్రామసభ నిర్వహించనున్నట్లు తెలియవచ్చింది. ఎంపేడు, మన్నవరంలో అంగన్‌వాడీ వర్కర్లను తొలగించి తమ వారిని నియమించుకునేందుకు టీడీపీ నేతలు రంగం సిద్ధం చేశారు. ఎవరినైతే తొలగించాలని నిర్ణయించుకున్నారో వారికి సంబంధిత అధికారి చేత మెమోలు ఇప్పించారు. శ్రీకాళహస్తి ప్రభుత్వ ఆసుపత్రిలో ముగ్గురు పారిశుద్ధ్య కార్మికులను తొలగించి ఇదే రీతిలో పావులు కదుపుతున్నారు. వచ్చేనెల మొదటి వారంలో నియోజకవర్గ పరిధిలో పలువురు చిరుద్యోగులను తొలగించేందుకు వారిపై లేనిపోని అపవాదులు మోపుతున్నారు.

లెటర్ ప్యాడ్‌లో తొలగింపుల జాబితా

చిత్తూరు జిల్లా పరిధిలో ముగ్గురు టీడీపీ నాయకులు వారి మనుషులను ఫీల్డ్ అసిస్టెంట్లుగా నియమించుకునేందుకు ఉన్నతాధికారులపై ఒత్తిళ్లు చేస్తున్నారు. ఓ జాబితాను సిద్ధం చేసి టీడీపీ నాయకుల లెటర్ ప్యాడ్‌లో పేరు, ఊరు రాసి ఉన్నతాధికారికి లేఖ పంపారు. పూతలపట్టు నియోజకవర్గంలో మొత్తం 60 మందిని క్షేత్రసహాయకులను తొలగించి వారి స్థానంలో టీడీపీ నాయకుల బంధువులు, సన్నిహితులను నియమించేందుకు రంగం సిద్ధం చేశారు.

పారిశుద్ధ్య కార్మికులనూ విడిచిపెట్టని వైనం

చివరకు ఎంతగా దిగజారారంటే పంచాయతీల్లో పారిశుద్ధ్య కార్మికులపై సైతం కూటమి నేతలు తమ ప్రతాపం చూపుతున్నారు. ఆ పనుల్లో కూడా తమ వారే ఉండాలంటూ ఒత్తిళ్లు చేస్తున్నారు. పారిశుధ్య కార్మికుల్లో ఎక్కువ మంది పేదవారే ఉంటారు. రెక్కాడితే గానీ డొక్కాడని బతుకులు వారివి. వారికి పార్టీ నాయకులతో సంబంధం ఉండదు. ఎవ్వరూ చేయలేని పనులు కూడా చేసి గ్రామాలు శుభ్రంగా ఉంచేందుకు శ్రమిస్తుంటారు. ఆ అల్పజీవుల కడుపు కొట్టేందుకు కూడా కూటమి నేతలు చేస్తున్న ప్రయత్నాలను చూసి ప్రజా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.





ఆగస్టు 10 లోపు ఇంటింటా సర్వే

- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

కుప్పం: నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఇంటింటా సర్వేను ఆగస్టు 10 లోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. జూలై 19న ప్రారంభించిన ఇంటింటా సర్వేను నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రతి ఇంటా ఆరోగ్య స్థితిగతులపై పూర్తి స్థాయిలో సర్వే చేయాలన్నారు. కంటి సమస్యలు, మధుమేహం వ్యాధిగ్రస్తులపై ప్రత్యేక శ్రద్ధ వహించి, వారికి వైద్యసేవలు అందేలా చూడాలని, అలాగే గర్భవతులు, బాలింతలపై దృష్టి పెట్టి వారందరికీ పౌష్టికాహారం అందేలా చూడాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. సుఖప్రసవం అనంతరం తల్లి బిడ్డల సంరక్షణ కోసం 40 రోజుల పాటు పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ విజయకుమారి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

రూ.8.42కోట్లతో టమాట ప్రాసెసింగ్ యూనిట్

నియోజకవర్గంలో రామకుప్పం మండలంలో టమాట ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ వెల్లడించారు. ఇందు కోసం చెల్దిగానిపల్లె వద్ద కడా ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ మర్మత్‌తో కలసి ఆయన స్థల పరిశీలన చేశారు. రూ 8.42 కోట్లతో టమాట రైతుల కోసం ప్రాసెసింగ్ యూనిట్‌ను నిర్మించనున్నట్టు చెప్పారు. తద్వారా రైతులకు 100 శాతం ఆర్థిక సహాయం అందివ్వాలని మర్మత్ కోరారు.

అందుబాటులో నూతన ఎస్‌పీఎం



మూసివేసిన పాత ఎస్‌పీఎం కేంద్రం



మరమ్మతులు చేస్తున్న కార్మికులు

- రూ.1.47 కోట్లతో నిర్మాణం
- ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు

నగరంలో నూతన ట్రాన్స్‌కో స్పెషల్ మెయింటెన్స్ (ఎస్‌పీఎం) కేంద్రంలో సేవలను అందుబాటులోకి తెచ్చారు. దాదాపు 60 ఏళ్ల క్రితం ప్రస్తుత తిరుపతి జిల్లా రేణిగుంటలో తొలిసారి ఎస్‌పీఎం కేంద్రంను ప్రారంభించారు. అక్కడి నుంచి ఉమ్మడి జిల్లాలో మరమ్మతులకు గురైన ట్రాన్స్‌ఫార్మర్లను రిపేరు చేసి పంపేవారు. తర్వాత స్థానిక గిరింపేటలో ఎస్‌పీఎంను ప్రారంభించగా అక్కడ షార్ట్‌సర్క్యూట్‌కు గురై ఆస్తినష్టం సంభవించడం, సరైన సౌకర్యం లేకపోవడంతో కొత్త కేంద్రాన్ని రూ.1.47 కోట్లతో నిర్మించారు.

పెరిగిన మరమ్మతులు

తొలుత చిత్తూరులో కేంద్రాన్ని ప్రారంభించినప్పుడు నెలకు 10 ట్రాన్స్‌ఫార్మర్లు వచ్చేవి. ప్రస్తుతం రోజు పది వరకు మరమ్మతులు చేస్తున్నట్టు అధికారులు చెప్పారు. తర్వాత కాలంలో పలమనేరు, మదనపల్లె, పుంగనూరు, పీలేరు, శ్రీకాళహస్తి, పుత్తూరులో మరమ్మతు కేంద్రాలను నిర్మించారు. చిత్తూరు, పూతలపట్టు, జీడీనెల్లూరు నియోజకవర్గాల్లో దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్లను చిత్తూరులో మరమ్మతులు చేస్తున్నారు.

నూతన కేంద్రం

2020లో ఎస్‌పీఎంలో జరిగిన షార్ట్‌సర్క్యూట్ మూలాన దాదాపు రూ.6 లక్షలు ఆస్తి నష్టం కలిగింది. నివాసాల మధ్య ఈ కేంద్రం ఉండటం ప్రమాదాలకు తావిచ్చే అవకాశం ఉందని స్థానికుల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. ఇదికాక పక్కనే ఉన్న జిల్లా స్టోర్‌ను విస్తరించాల్సి ఉంది. ప్రమాదం జరిగాక నూతన కేంద్రం నిర్మాణానికి అధికారులు నివేదిక సమర్పించారు. తర్వాత అనుమతులు మంజూరవడంతో గిరింపేట ఏఈ కార్యాలయ సమీపంలో నూతన కేంద్రాన్ని నిర్మించారు.

సౌలభ్యం ఎక్కువ



గతంలో కంటే కొత్త కేంద్రంలో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు సౌలభ్యం ఎక్కువగా ఉంది. స్థలం ఎక్కువ. ఇరువైపులా దారి ఉంది. పైకప్పు ఉండడంతో వర్షం వచ్చినా మరమ్మతులు చేసేందుకు ఎలాంటి ఇబ్బందీ ఉండదు. ఆధునిక హీటింగ్ చాంబర్, ఆయిల్ ట్యాంకుతో మరమ్మతులు త్వరితగతిన చేయిస్తున్నాం.

– ఆనంద్, డీఈ ఎస్‌పీఎం

అలరించిన నృత్య ప్రదర్శన



నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

తిరుపతి కల్చరల్: అభినయ ఆర్ట్స్ జాతీయ స్థాయి నృత్య, నాటకోత్సవాల్లో భాగంగా బుధవారం మహతి కళాక్షేత్రంలో ప్రదర్శించిన శాస్త్రీయ, జానపద నృత్యాలు, పౌరాణిక, సాంఘిక నాటక ప్రదర్శనలు భారతీయ సంస్కృతి, సంప్రదాయ కళా వైభవాన్ని ఆవిష్కరించాయి. బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సాగిన ఈ నృత్య పోటీల్లో సుమారు 180 మంది కళాకారులు అద్భుతంగా నృత్యాభినయ ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. అనంతరం మధ్యాహ్నం విజయనగరం జిల్లాకు చెందిన కళాసాగర్ నాటక సంక్షేమ సేవా సంఘం ప్రదర్శించిన 'శ్రీకాళహస్తీశ్వర మహత్యం' పౌరాణిక నాటకం ఆద్యంతం భక్తిపారవశ్యంతో ప్రేక్షకులను అలరింపజేసింది. తర్వాత గుడివాడకు చెందిన శ్రీకృష్ణ తెలుగు థియేటర్ ఆర్ట్స్ ప్రదర్శించిన 'మళ్లీ కలసి జీవిద్దాం' సాంఘిక నాటిక ప్రేక్షకుల్లో ఆలోచనలను రేకెత్తించింది. అనంతరం విశాఖపట్నంకు చెందిన తెలుగు కళాసమితి ప్రదర్శించిన 'నిశ్శబ్దమా నీ ఖరీదెంత?' సాంఘిక నాటిక ప్రేక్షకులను ఆకట్టుకుంది. అనంతరం నాటక, నృత్య ప్రదర్శనలు ఇచ్చిన కళాకారులను అభినయ ఆర్ట్స్ వ్యవస్థాపక కార్యదర్శి బీఎస్ రెడ్డి, సంస్థ ప్రతినిధులు శాలువలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించి అభినందించారు.

ఒంటరి ఏనుగు బీభత్సం



ఒంటరి ఏనుగు ధ్వంసం చేసిన ఫెన్సింగ్

ఐరాల: మండలంలో ఒంటరి ఏనుగు మళ్లీ విజృంభించింది. బుధవారం అర్ధరాత్రి వినాయకపురం గ్రామానికి చెందిన రైతు సాయిశంకర్‌రెడ్డి మామిడి, కొబ్బరి, అరటి చెట్లను విరిచేసింది. మామిడి తోటకు ఉన్న ఫెన్సింగ్‌ను ధ్వంసం చేసింది. బోరుకు అమర్చిన పైపులను తొక్కి నాశనం చేసింది. మోహన్‌రెడ్డి మామిడి తోట ఫెన్సింగ్‌ను కూలదోసి, బోరు పైపులను ధ్వంసం చేసింది. వినయ్‌కుమార్‌రెడ్డికి చెందిన మామిడి చెట్లను విరిచేసి, ఫెన్సింగ్‌ను ధ్వంసం చేసింది. అలాగే అపోలో వారికి చెందిన ఉసిరి చెట్లను విరిచేసి, రాతికూసాలను కూలదోసింది. సుమారు లక్ష రూపాయల వరకు నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు. అటవీశాఖ అధికారులు స్పందించి ఏనుగుల బారి నుంచి పంటలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

పంటలపై ఏనుగుల దాడి

పుంగనూరు: సోమల మండలంలో ఏనుగులు పంటలను ధ్వంసం చేశాయి. మంగళవారం రాత్రి గజరాజులు టమాట, మామిడి, అరటి పంటలను తొక్కి నాశనం చేయడంతో పత్రపల్లె రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఏనుగులు ప్రతి రోజూ పంటలపై దాడులు చేయడం పరిపాటిగా మారింది. అటవీ అధికారులు ఇకనైనా ఏనుగుల కట్టడికి చర్యలు తీసుకుని పంటలను కాపాడాలని రైతులు కోరారు.

క్లుప్తంగా

కుమార్తెను చూసేందుకు వెళ్తూ మృత్యువాత


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గోవిం

బంగారుపాళెం: కుమార్తెను చూసేందుకు వెళ్తూ రోడ్డు ప్రమాదంలో ఓ తండ్రి మృత్యువాత పడిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. పలమనేరు మండలం బొమ్మిదొడ్డికి చెందిన గోవిందరెడ్డి(69) మండలంలోని కల్లూరుపల్లెలో ఉన్న కుమార్తె రేణుకను చూడటానికి ద్విచక్ర (టీవీఎస్) వాహనంపై బయలుదేరాడు. మార్గమధ్యంలో బంగారుపాళెం సమీపంలోని గోమతి స్పిన్నింగ్ మిల్ వద్ద చెన్నై–బెంగళూరు రహదారిపై ద్విచక్రవాహనాన్ని ఈచర్ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన గోవిందరెడ్డిని చికిత్స నిమిత్తం బంగారుపాళెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పాఠశాలల్లో 'ప్లాంట్ ఫర్ మదర్'

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ బడుల్లో ఆగస్టు 31వ తేదీ వరకు ప్లాంట్ ఫర్ మదర్ కార్యక్రమం పేరిట మొక్కలు నాటాలని నిర్వహించాలని డీఈఓ దేవరాజు ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేయాలని, పర్యావరణ పరిరక్షణలో భాగంగా దీనిని నిర్వహించనున్నట్లు డీఈఓ పేర్కొన్నారు.

విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌పై వేటు

చిత్తూరు అగ్రికల్చర్: శాంతిపురం మండలం చెంగుబళ్ల విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ (వీఏఏ)ను సస్పెండ్ చేస్తూ బుధవారం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. చెంగుబళ్ల గ్రామ రైతు భరోసా కేంద్రం ద్వారా విక్రయించిన ఎరువులకు సంబంధించి రూ.2.38 లక్షలు ప్రభుత్వానికి చెల్లించకుండా స్వాహా చేసినందుకు సస్పెండ్ చేసినట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ తెలిపారు.

భక్తిప్రపత్తులతో సంకటహర చతుర్థి


పల్లకిలో స్వామివారిని తీసుకొస్తున్న ఆలయ అధికారులు, సిబ్బంది


వ్రతమాచరిస్తున్న భక్తులు

కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో బుధవారం సంకటహర చతుర్థిని భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. పల్లకిలో ఊరేగించారు. అనంతరం అర్చకులు 717 మంది భక్తులుతో వ్రతం నిర్వహించారు. రాత్రి బంగారు రథంలో స్వామి విహరిస్తూ భక్తులను కటాక్షించారు. కార్యక్రమంలో ఈఓ వెంకటేశు, ఎస్‌ఐ రామ్మోహన్, ఏఈఓ హరిమాధవరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. – కాణిపాకం

శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలకు అటానమస్ హోదా

తిరుపతి సిటీ: తిరుపతి కరకంబాడి రోడ్డులోని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలకు అటానమస్ హోదా లభించినట్లు ఆ కళాశాల డైరెక్టర్ మన్నెం అరవింద్ కుమార్‌రెడ్డి బుధవారం తెలిపారు. విద్యాప్రమాణాల్లో మార్పులకు అనుగుణంగా కళాశాలలో అన్ని మౌలిక వసతులు కల్పించామన్నారు. విద్యార్థులకు నాణ్యమైన బోధన, ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పనే లక్ష్యంగా యాజమాన్యం పనిచేస్తోందన్నారు. కళాశాలలో చదివిన వేలాదిమంది విద్యార్థులు క్యాంపస్ డ్రైవ్‌లో ఉద్యోగాలు సాధించి ఉన్నత స్థాయిలో ఉండడం సంతోషకరమన్నారు. ఇటీవలే శ్రీరామ కళాశాలకు యూజీసీ నాక్ ఏ గ్రేడ్ లభించిందన్నారు. ఈ గుర్తింపు రావడానికి కృషిచేసిన చైర్మన్ మన్నెం రామిరెడ్డి, సెక్రటరీ మన్నెం రామసుబ్బారెడ్డికి, ప్రిన్సిపల్ కే జయచంద్ర, అధ్యాపక బృందానికి ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

జేసీకి తహసీల్దార్ల నివేదికలు


ప్రొఫార్మా వివరాలను అందజేసేందుకు కలెక్టరేట్‌కు వచ్చిన తహసీల్దార్లు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో గత ఐదేళ్లలో మంజూరు చేసిన ఫైళ్ల వివరాలను కలెక్టరేట్ అధికారులు సేకరిస్తున్నారు. 22ఏ, అసైన్‌మెంట్, వెబ్‌ల్యాండ్ మంజూరు జిల్లా వ్యాప్తంగా ప్రతి మండలంలో ఎన్ని చేశారు? ఎవరెవరికి ఇచ్చారు? 22ఏ కేసుల్లో ఎంత భూమికి సంబంధించి మంజూరు చేశారు? అనే వివరాలను సేకరిస్తున్నారు. ఇందుకు సంబంధించి సీసీఎల్‌ఏ నుంచి ఈ నెల 23న రాత్రి కలెక్టర్‌కు ఆదేశాలు అందడంతో సంబంధిత ప్రొఫార్మాను సిద్ధం చేసేందుకు కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్డీఓలు, తహసీల్దార్లు కుస్తీ పడుతున్నారు. ఈ నెల 25న అన్నమయ్య జిల్లా మదనపల్లె లోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సీసీఎల్‌ఏ రామ్‌ప్రకాష్ సిసోడియా సమీక్ష నిర్వహించనున్నారు. ఈ సమీక్షకు సంబంధిత నివేదికలు తీసుకురావాలని ఆదేశించారు. దీంతో బుధవారం జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్లు వివరాలను తీసుకొచ్చి జేసీకి సమర్పించారు.

పనులకు టెండర్లు, బహిరంగ వేలం

కాణిపాకం: కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో వివిధ పనులకు బుధవారం టెండర్లు, బహిరంగ వేలం నిర్వహించారు. తలనీలాల పోగుకు రూ.60,000, వాహనాలు శుభ్రంకు రూ.20,09,500, బస్టాండు వద్ద క్యాంటీన్‌కు రూ.49,90,999, పాత బొలెరో వాహనానికి రూ.2,20,000, లైటింగ్‌షో రెండు షాపులకు గాను రూ.1,63,000 ఆదాయం వచ్చిందని ఈఓ వెంకటేశు తెలిపారు.

160 లీటర్ల సారా ధ్వంసం


సారాను మురుగు కాలువలో పారబోస్తున్న ఎస్‌ఈబీ ఏఈఎస్ రవి, సిబ్బంది

కార్వేటినగరం: సారా స్థావరాలపై దాడులు చేసి 160 లీటర్ల సారాను ధ్వంసం చేసినట్లు ఎస్‌ఈబీ ఏఈఎస్ రవి బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. అందని రహస్య సమాచారం మేరకు మండలంలో వివిధ చోట్ల దాడుల్లో 13 కేసులు నమోదు చేశారు. ఈ కేసుల్లో స్వాధీనం చేసుకున్నట్టు 160 లీటర్ల సారాను ధ్వంసం చేశారు. ఎక్కడైనా గ్రామాల్లో అక్రమంగా సారా తయారు చేస్తున్నా, విక్రయిస్తున్నా తమకు లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఈబీ సీఐ లక్ష్మీదుర్గయ్య, ఎస్‌ఐ భారతి, సివిల్ ఎస్‌ఐ వెంకటకృష్ణ, పోలీసులు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న మాజీ మంత్రి వితరణ


పుత్తూరులో పౌష్టికాహారం అందుకున్న గర్భిణులు

పుత్తూరు: స్థానిక వైద్య విధాన పరిషత్ ఆసుపత్రిలో బుధవారం పరీక్షల నిమిత్తం వచ్చిన గర్భిణులు, వారి సహాయకులకు 'రోజా చారిటబుల్ ట్రస్ట్' ఆధ్వర్యంలో పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. వైద్య పరీక్షల నిమిత్తం వేచి ఉన్న సమయంలో గర్భిణులు భోజనానికి ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో మాజీ మంత్రి ఆర్కే రోజా పుత్తూరు, నగరి ప్రభుత్వ ఆసుపత్రుల్లో పౌష్టికాహారం పంపిణీ చేస్తుండటం విదితమే. వెజిటబుల్ ఫలావ్, వైట్ రైస్, గుడ్డు, కర్రీస్, పచ్చడి, సాంబారు, రసం, పెరుగు అన్నం, చిక్కీ, అరటిపండును అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఢిల్లీ ధర్నాలో ఉమ్మడి జిల్లా నేతలు


ధర్నాలో పాల్గొన్న ఉమ్మడి జిల్లా నాయకులు

వి.కోట: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద చేసిన ధర్నాలో జిల్లాకు చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు. వారిలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీలు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, గురుమూర్తి, మాజీ ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు , పలువురు మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు ఉన్నారు.

కేజీబీవీ ప్రిన్సిపల్స్‌కు నైట్ డ్యూటీలు

చిత్తూరు కలెక్టరేట్ : కేజీబీవీ (కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ) పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రిన్సిపాళ్లు విధిగా నైట్ డ్యూటీలు చేయాలని రాష్ట్ర సమగ్ర శిక్ష అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఈ ఉత్తర్వులు ఈ నెల 24న జిల్లా సమగ్రశిక్ష కార్యాలయం కు అందాయి. ఉత్తర్వులు పాటించని ప్రిన్సిపాళ్లు ఉన్నట్‌లైతే తనిఖీలు చేసి చర్యలు తీసుకోవాలని జిల్లా సమగ్రశిక్ష ఏపీసీని ఆదేశించారు.

ఎయిడెడ్ పాఠశాలలను తనిఖీ చేయండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ఎయిడెడ్ పాఠశాలలను తనిఖీ చేయాలని రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు ఈ నెల 24న ఉత్తర్వులు జారీచేశారు. ఆ ఉత్తర్వుల మేరకు..ఎయిడెడ్ పాఠశాలల్లో పోస్టుల పెంపు కోసం అక్రమదారులు తొక్కారని, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల పేర్లు ఎయిడెడ్ పాఠశాలల్లో నమోదైనట్లు ఫిర్యాదులు వచ్చాయని పేర్కొన్నారు. తప్పుల తడకగా యూ డైస్ వివరాలు నమోదు చేశారని, వీటిపై డీఈఓలు జిల్లాలోని ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలలను క్షుణ్ణంగా తనిఖీ చేసి చర్యలు తీసుకోవాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు.

నాగపట్ల బీట్‌లో ఎర్రచందనం స్వాధీనం


దుంగలను చూపుతున్న ఫారెస్టు అధికారులు

భాకరాపేట: శేషాచలం అటవీ ప్రాంతంలోని నాగపట్ల ఈస్ట్ బీట్‌లో 7 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు భాకరాపేట ఫారెస్ట్ రేంజర్ దత్తాత్రేయ తెలిపారు. భాకరాపేట ఫారెస్టు కార్యాలయం వద్ద బుధవారం సాయంత్రం స్థానిక విలేకరులకు వివరాలు వెల్లడించారు. తమకు అందిన సమాచారం మేరకు భాకరాపేట ఘాట్ రోడ్డు మార్గం నుంచి నాగపట్ల కనుమ, ఈస్ట్ బీట్ వరకు వేర్వేరుగా కూంబింగ్ చేపట్టామన్నారు. నాగపట్ల ఈస్ట్ బీట్ పరిధిలోని ఈతగుంట వద్ద దుంగలు తీసుకొస్తున్న ఏడుగురిని గుర్తించి వారిని చుట్టుముట్టే ప్రయత్నం చేయగా, వారు రాళ్లు విసురుతూ పారిపోయారన్నారు. వారి కోసం రెండు బృందాలు కూంబింగ్ కొనసాగిస్తున్నాయని తెలిపారు. ఆ ప్రాంతంలో 243 కేజీలు బరువు ఉన్న సుమారు రూ.6 లక్షలు విలువ చేసే 7 దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కూంబింగ్‌లో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ వేణు, ఎఫ్‌బీఓ రవి, రెడ్డెప్పరెడ్డి, బేస్ క్యాంప్ సిబ్బంది, ప్రొటెక్షన్ వాచర్లు తదితరులు పాల్గొన్నారు.

రూ.1.21 కోట్లకు ఐపీ పెట్టిన వ్యాపారి

తిరుపతి లీగల్ : పట్టణంలోని ఎంఆర్ పల్లి, గరుడాద్రి నగర్, శ్రీనగర్ కాలనీకి చెందిన కె.మనోహర్ రెడ్డి తిరుపతి అదనపు సీనియర్ సివిల్‌జడ్జి కోర్టులో ఒక కోటి 21 లక్షల 96 వేల రూపాయలకు ఐపీ దాఖలు చేసినట్టు ఆయన తరపు న్యాయవాది పత్తికొండ మురళి తెలిపారు. పిటిషన్‌లోని వివరాల మేరకు.. పిటిషనర్ మనోహర్ రెడ్డి తిరుపతి, తిరుమలలో ఇత్తడి విగ్రహాలు, నాణాల వ్యాపారం నిర్వహించేవాడు. కోవిడ్‌తో అతనికి వ్యాపారంలో తీవ్ర నష్టం వాటిల్లింది. దీంతో అతను కొంతమంది వద్ద అధిక వడ్డీలకు నగదు అప్పుగా తీసుకున్నాడు. వ్యాపారంలో పోటీ పెరగడంతో వచ్చిన నష్టాలను పూడ్చుకోవడానికి అతను తిరుమలలో హాకర్ లైసెన్సు తీసుకుని వ్యాపారాన్ని ప్రారంభించాడు. దీనికిగాను అతను మరి కొంతమంది వద్ద సొమ్మును అప్పుగా తీసుకున్నాడు. మొదట్లో తీసుకున్న అప్పులు, మళ్లీ తీసుకున్న అప్పులకు వడ్డీలు చెల్లించలేక ఆ వ్యాపారాన్ని యజమానికి అప్పగించాడు. తన పిల్లలను చదివించుకోవడానికి అతను ఓ ప్రైవేటు చిట్స్‌లో సభ్యుడిగా చేరాడు. అయితే ఆ చిట్ యజమానులు సొమ్ము తీసుకుని పరారయ్యారు. ఇదివరలో తీసుకున్న సొమ్ముకు వడ్డీలు అధికం కావడంతో పాటు చిట్స్‌లో వేసిన సొమ్మును యజమానులు చెల్లించకపోవడంతో రుణదాతలకు సొమ్ము చెల్లించలేని స్థితిలో ఈ ఐపీని దాఖలు చేసినట్టు ఆయన పిటిషన్‌లో పేర్కొన్నాడు. 37 మంది రుణదాతలను ఆయన పిటిషన్‌లో ప్రతివాదులుగా చేర్చాడు.

జోరుగా సారా తయారీ

- విచ్చలవిడిగా సారా అమ్మకాలు
- ప్యాకెట్ రూ.30 మాత్రమే
- పది ప్యాకెట్లు కొంటే రెండు ఫ్రీ!
- మద్యం మత్తులో యువకులు
- పట్టించుకోని అధికారులు


చౌడేపల్లెలో అటవీ ప్రాంతంలో సారా కాస్తున్న దృశ్యం

చౌడేపల్లె: గ్రామీణ ప్రాంతాల్లో సారా విచ్చలవిడిగా విక్రయిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలొస్తున్నాయి. సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుతామని కూటమి ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించడం తప్పితే వాస్తవం దీనికి భిన్నంగా ఉంటోంది. గ్రామాల్లో ఎటు చూసినా సారా ఏరులై పారుతోంది. సారా తయారీని అరికట్టడానికి ఎక్సైజ్ శాఖ గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నా ఫలితం శూన్యం. పైగా అధికారుల అండదండలతోపాటు రాజకీయ అండతో సారా అక్రమార్కులు దర్జాగా వ్యాపారం సాగిస్తున్నారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో సారా చిచ్చుతో ఘర్షణలు, చోరీలు జరుగుతున్నాయి.మద్యం ప్రియులు సారా మత్తులో తూగుతున్నారు. మండలంలోని అటవీ ప్రాంతాలు, జన సంచారంలేని ప్రాంతాల్లో గుట్టుచప్పుడు కాకుండా జోరుగా సారా తయారు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సారా వ్యాపారం మూడు క్యాన్లు..ఆరు కుండలు అన్న చందాన సాగుతోంది. తక్కువ ధరకే కావాల్సినంత కిక్కు ఎక్కుతుండడంతో మద్యం ప్రియులు సారా వైపు ఆకర్షితులవుతున్నారు. మండలంలోని దుర్గసముద్రం, బండమీదపల్లె, గాజులవారిపల్లె, బోయకొండ గంగాపురం, ఊటూరు, కాగతి, కాటిపేరి, భవానీనగర్, లక్ష్మీపురం, శికారిపాళ్యం, పక్షిరాజపురం కొలింపల్లె, పరికిదొన, మడుకూరు, దొనపల్లె పరిసర ప్రాంతాల్లో సారా వ్యాపారం జోరుగా సాగుతోంది. సారాను వ్యాపారులు పొట్లాలుగా ప్యాక్ చేసి, ఒక్కొక్క పొట్లాన్ని రూ.30 నుంచి రూ.40వరకు విక్రయిస్తున్నారు. పది పొట్లాలు కొన్నవారికి రెండు ప్యాకెట్లు ఫ్రీ ఆఫర్ సైతం ప్రకటించారట! ఆర్డర్ల మేరకు సారా తయారీదారులు ద్విచక్రవాహనాల్లో వివిధ గ్రామాల్లో దర్జాగా తరలిస్తున్నారు. సారా కారణంగా కుటుంబాలు కూలిపోతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ఎక్సైజ్ పోలీసులు స్పందించాలని గ్రామస్తులు, మహిళలు కోరుతున్నారు.

దుస్తులు ఆరేసే దారాలు తీయమన్నందుకు..

- మహిళపై విచక్షణారహితంగా దాడికి పాల్పడిన మరో మహిళ, వారి బంధువులు
- పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించిన బాధిత కుటుంబం
- పోలీసుల ఎదుటే మరోసారి బాధిత మహిళపై దాడి
- న్యాయం చేయాలని ఎస్పీని ఆశ్రయించిన వైనం


లక్ష్మిపై దాడికి పాల్పడుతున్నట్లు సీసీ ఫుటేజీలో నమోదైన దృశ్యాలు

చంద్రగిరి: ఇంటిపై దుస్తులు ఆరేసేందుకు కట్టిన దారాలను తీసేయాలని కోరిన మహిళపై పక్కింటి వారు విచక్షణరహితంగా దాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు.. మండలంలోని తొండవాడ పంచాయతీ ఓం శక్తి వీధికి చెందిన లక్ష్మి, కిరణ్ కుమార్ దంపతులు నివాసం ఉంటున్నారు. వీరి పక్కనే లావణ్య అనే మహిళ కాపురం ఉంటోంది. అయితే గత కొంతకాలంగా లక్ష్మి ఇంటిపై ఉన్న సిమెంట్ పిల్లర్స్‌కు లావణ్య దుస్తులు ఆరేసేందుకు దారాలు కడుతూ వారికి అసౌకర్యం కలిగిస్తోంది. ఈ క్రమంలో శనివారం తమ ఇంటిపై దారాలు ఎందుకు కడతారు ? వాటిని తీసేయాలని లావణ్యను కోరింది. దీంతో లక్ష్మిని దుర్భాషలాడుతూ లావణ్య చెప్పుతో దాడికి పాల్పడింది. అంతటితో ఆగకుండా బంధువులను పిలిపించి, వారితో మరోసారి లక్ష్మిపై దాడి చేయించింది. ఈ క్రమంలో లావణ్య బంధువులు, లక్ష్మిని పరుష పదజాలంతో దూషించారు. దీంతో బాధిత మహిళ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే పోలీసుస్టేషన్‌లోనే మారోమారు తనపై లావణ్య బంధువులు దాడికి పాల్పడ్డారని లక్ష్మి ఆవేదన వ్యక్తం చేసింది. తన భర్తతో పాటు ఇంటర్మీడియెట్ చదువుతున్న తన కుమార్తెను పోలీసులు అన్యాయంగా లోపల కూర్చోబెట్టారని, తాము ఫిర్యాదు చేస్తే, పోలీసులు దాడి చేసిన వారి పక్షాన మాట్లాడుతున్నారని వాపోయింది. లావణ్యతో పాటు వారి బంధువులు కేసును వాపసు తీసుకోవాలంటూ ఒత్తిళ్లకు పాల్పడుతున్నారని, కేసు వాపసు తీసుకోకపోతే నీ కూతురు కళాశాలకు ఎలా వెళ్తుందో చూస్తామంటూ బెదిరిస్తున్నట్లు కన్నీటి పర్యంతమైంది. విదేశాల్లో ఉన్న వారి బంధువులు సైతం ఫోన్‌లు చేసి చంపేస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతున్నట్లు వారు తెలిపారు. గత కొద్దికాలంగా కాలనీలోని పలువురిపై లావణ్య తరపు వాళ్లే ఇదే రీతిలో దాడులు చేస్తూ, బెదిరింపులకు పాల్పడుతున్నట్లు స్థానికులు తెలిపారు. బుధవారం బాధితులతో పాటు స్థానిక కాలనీ వాసులు తిరుపతి ఎస్పీని ఆశ్రయించి, తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారు.

27న జాబ్‌మేళా

తిరుపతి సిటీ: ఎస్వీయూ ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో ఈనెల 27వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కార్యాలయ అధికారి టి.శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఐటీఐ, ఇంటర్, డిగ్రీ, బీఎస్సీ నర్సింగ్, బీఎస్సీ ఎంఎల్‌టీ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఐదు ఎంఎన్‌సీ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9533889902, 7989810194ను సంప్రదించాలని కోరారు.

1న కెమెరాల ఈ–వేలం

తిరుపతి(అలిపిరి): తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు ఇతర అనుబంధ ఆలయాల్లో హుండీ ద్వారా భక్తులు కానుకగా సమర్పించిన కెమెరాలను ఆగస్టు 1న రాష్ట్ర ప్రభుత్వ కొనుగోలు పోర్టల్ ద్వారా ఈ– వేలం వేయనున్నట్లు టీటీడీ ఈవో జె.శ్యామలరావు తెలిపారు. ఇందులో నికాన్, కెనాన్, కొడాక్ తదితర కెమెరాలు ఉన్నాయన్నారు. ఉపయోగించినవాటితోపాటు పాక్షికంగా దెబ్బతిన్న కెమెరాలు మొత్తం 10 లాట్లు ఈ–వేలంలో ఉంచారు. వివరాలకు తిరుపతిలోని టీటీడీ మార్కెటింగ్ కార్యాలయంలోగానీ, 0877–2264429 నంబరులో కార్యాలయం వేళల్లో సంప్రదించవచ్చు. అలాగే టీటీడీ వెబ్‌సైట్ www. tirumala. org లేదా రాష్ట్ర ప్రభుత్వ పోర్టల్ www.konugolu.ap.gov.in ను చూడొచ్చు.